
అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 17-10- 2026 సంపుటి : 6 సంచిక : 245 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం.


2లో

- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు.
- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి
- రైతులకు, యువతకు మెరుగైన అవకాశాలు లభించాలి.
- రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

ఎంపీ మిథున్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్

అమరావతి, భీమోదయం:
స్థానిక సంస్థల ఎన్నికలు నామినేషన్ సందర్భంగా శుక్రవారం పుంగనూరు లో జరిగిన దాడి ఘటనపై ఎంపీ మిథున్ రెడ్డి కి వైఎస్ జగన్ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరపాలన్న ఉద్దేశం చంద్రబాబుకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


2లో

సింగరేణి స్కామ్‌లపై ఎంక్వైరీకి రెడీ..

- దమ్ముంటే జడ్జికి లేఖ రాయు.. • సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- నీ సర్కార్ అక్రమాలను బట్టబయలు చేస్తా.. • కేటీఆర్ సవాల్



హైదరాబాద్, **అభ్యుదయం**
సింగరేణి సంస్థలో స్కామ్‌లపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. జడ్జికి రేవంత్‌రెడ్డి లేఖ రాస్తే తాను పూర్తి ఆధారాలు సమర్పిస్తానని తేల్చిచెప్పారు. 'బొగ్గు అంశంలోనే కాదు.. నువ్వు చేసిన అక్రమాలు, నీ బామ్మర్ది సృజన్‌రెడ్డి సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10 వేల కోట్ల కుంభకోణం, నువ్వు చేసిన పవర్ స్కామ్, విదేశీ బొగ్గు కొనుగోలు పేరిట సాగుతున్న కమీషన్ల బాగోతాన్ని కూడా బయటపెట్టేందుకు సిద్ధం' అని ప్రకటించారు.'సింగరేణి నిండా కుంభకోణాలున్నాయని మొన్న లేఖ రాసిన.. అంతకుముందు రోజు బహిరంగ సభలో బయటపెట్టిన.. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొన్న అడ్డగోలుగా మాట్లాడి స్కామ్‌లను కప్పిపుచ్చుకొనేందుకు యత్నించారు' అని మండిపడ్డారు. ఇప్పుడు ఏటా 70 వేల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సంస్థను కాదని విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకొనేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిని బొందపెట్టి కమీషన్ల కోసం ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో 24 గంటల కరెంట్ ఇచ్చి తెలంగాణకు వెలుగులు పంచిన సిరుల సింగరేణిని బదనాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'సంస్థను సంక్షోభంలోకి నెట్టి అంతా ఆగమైన తర్వాత కరెంట్ కొనాలి.. బొగ్గు తేవాలి.. సింగరేణి బొగ్గు వద్దు..భారతదేశం బొగ్గు వద్దు.. విదేశీ బొగ్గు ముద్దు' అని అంటున్నారని దెప్పిపొడిచారు.

మిగతా 2లో

ప్రతి రక్తదాతా...

జీవదాతే

-పేదల జీవితాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భరోసా
-నారా భువనేశ్వరి



విజయవాడ,**అభ్యుదయం**
రక్తదానం కేవలం దానం మాత్రమే కాదని, మరో మనిషి జీవితానికి ఇచ్చే భరోసా అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. చికిత్స సమయంలో రక్తం అవసరమైన కుటుంబం పడే ఆందోళనను అర్థం చేసుకుని, పేద రోగులకు అండగా నిలవాలనే సంకల్పంతో విజయవాడలో ఆధునిక రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తలసేమియా కేర్ సెంటర్, రక్తనిధి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

మిగతా 2లో



ఘనంగా 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ

- ప్రజా పోరాట వీరుడి చరిత్రను భావితరాలకు అందించాలి
- ఆడియోను ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటల రాజేందర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- పండుగ సాయన్న త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం: ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ **అభ్యుదయం**
ప్రజా పోరాట వీరుడిగా, తెలంగాణ రాబిన్ హుడ్‌గా గుర్తింపు పొందిన పండుగ సాయన్న పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు, చూపిన ధైర్యసాహసాలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

- మిగతా 2లో పేజీలో



రూ. 50 వేలకు మించి క్యాష్ ఉంటే సీజ్

అమరావతి, అభ్యుదయం
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లడంపై నిషేధం విధించింది. ప్రార్థనా స్థలాలను ప్రచారానికి వాడటం, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదేశించింది.

రోహిత్ వేముల' ముసాయిదా

మిగతా 2లో

బిల్లు సిద్ధం చేయండి

అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం



హైదరాబాద్, **అభ్యుదయం**
రోహిత్ వేముల తెలంగాణ ముసాయిదా బిల్లును మూడు నెలల్లోగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశించారు. బిల్లు కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడంతోపాటు, న్యాయ, విద్యా, హోంశాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల హకులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించి డిప్యూటీ సీఎం అధ్యక్షతన క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమైంది.

సొసైటీల్లోని నిధులపై కాంగ్రెస్ పెద్దల కన్ను

- సహకార సంఘాల పాలకవర్గ నామినేటెడ్ పద్ధతిని అడ్డుకుంటాం
- సొసైటీ చైర్మన్లకు కేటీఆర్ హామీ
- పీఏసీఎస్‌లకు ఎన్నికలు పెట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురండి
- రైతులకు పంట రుణాలూ ఇవ్వలేని దుస్థితిలో సహకార బ్యాంకులు
- కేటీఆర్‌కు పీఏసీఎస్ అధ్యక్షుల వినతి



హైదరాబాద్/మేడ్చల్, **అభ్యుదయం**
సొసైటీల్లోని నిధులపై కాంగ్రెస్ పెద్దల కన్నుపడిందని, సహకార సంఘాల పాలకవర్గ నామినేటెడ్ పద్ధతిని న్యాయవ్యవస్థ ద్వారా అడ్డుకొని తీరుతామని సంఘాల చైర్మన్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు.

మిగతా 2లో



రాయచోటి అభివృద్ధిపై చర్చకు రావాలి

-శ్రీకాంత్‌రెడ్డికి మండిపల్లి సవాల్

- రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి
- కార్యకర్తలను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు.

2లో

ప్రతి రక్తదాతా... జీవదాతే

ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ విజయవాడ ప్రజలకు సేవ, నమ్మకం, భరోసాకు చిరునామాగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం నిలుస్తుందని చెప్పారు. ఈ రక్తనిధి కేంద్రాన్ని నగర ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది కేవలం భవనం మాత్రమే కాదని, పేద రోగుల జీవితాలకు వారధి అని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. స్వర్గీయ ఎన్టీఆర్‌కు ప్రజలంటే అపారమైన ప్రేమ ఉండేదని, ప్రజల కోసం పనిచేయడమే ఆయన జీవితంలో భాగమని భువనేశ్వరి తెలిపారు. సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, సమాజంలోని చివరి వ్యక్తికి సైతం మెరుగైన జీవితం అందాలని ఆయన ఆకాంక్షించేవారని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ను స్థాపించారని వివరించారు. 29 ఏళ్లుగా ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, జీవనోపాధి, స్వచ్ఛమైన తాగునీరు తదితర రంగాల్లో ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు. ఇన్ని సేవలు చేసినప్పటికీ, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. మేనేజింగ్ ట్రస్టీగా ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వామిని కావడం తన అదృష్టమన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఏ ఒక్కరికో పరిమితమైన సంస్థ కాదని, సేవ చేయాలనే మనసున్న ప్రతి ఒక్కరిదని పేర్కొన్నారు. ప్రజల నమ్మకంతో నిర్మించిన ఈ సేవా సంస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు:

ఆరోగ్య రంగంలో ట్రస్ట్ విస్తృతంగా సేవలందిస్తోందని నారా భువనేశ్వరి చెప్పారు. సంజీవని మొబైల్ క్లినిక్స్ ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల్లో పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఎన్టీఆర్ ఆరోగ్య రథాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ఉచితంగా వైద్యం, ఔషధాలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ సుజల కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నామని చెప్పారు. ఎంత మందికి సేవలందించామనేది అంకెల్లో లెక్కించడం కంటే, ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకు రాగలిగాం అన్నదే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు.


విద్య రంగంలోనూ సేవలను విస్తరిస్తున్నామని భువనేశ్వరి తెలిపారు. పేద విద్యార్థులను భవిష్యత్తులో సమాజానికి అవసరమైన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళా సాధికారత కోసం ట్రస్ట్ విస్తృతంగా పని చేస్తోందని, మహిళలకు కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా కుటుంబానికి అండగా నిలవగలం అనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నామని వివరించారు. స్త్రీశక్తి హస్తకళా స్టోర్ ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయం లోనూ ట్రస్ట్ బాధితులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వరదలు, తుఫాన్లతో పాటు కోవిడ్ సమయంలోనూ విస్తృతంగా సేవలు అందిం చామని చెప్పారు. కష్ట కాలంలో ఒక మనిషికి మరో మనిషి అండగా నిలవాలన్నదే తమ ఆలోచన అని తెలిపారు.

ఘనంగా 'పండుగ సాయన్న

ఆడియో ఆవిష్కరణ

కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆడియోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ పండుగ సాయన్న ప్రజల కోసం చేసిన పోరాటాలను, ఆయన జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేయడం అభినందనీయమన్నారు. ఆయన ధైర్యసాహసాలు, ప్రజాసేవ, త్యాగాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఆడియోను రూపొందించిన నిర్వాహకులు, నిర్మాతలను ప్రత్యేకంగా అభినందిం చారు.చరిత్రలో నిలిచిపోయిన ప్రజా పోరాట యోధుల జీవితాలను ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు పరిచయం చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్



ముదిరాజ్, జగన్ మోహన్ రావు, చొప్పరి శంకర్, ఊపిరి నారాయణ, కార్యక్రమ నిర్వాహకులు, నిర్మాతలు ఆగం పండు (బాచుపల్లి మాజీ కార్పొరేటర్, మాజీ సర్పంచ్), ఆగం రాజు, ముదిరాజ్ ప్రజాప్రతినిధులు తలారి మల్లేష్, సామల హేమ, వీకే మహేష్, మండల వరలక్ష్మి, పిట్ల నాగేష్ ముదిరాజ్, రాస వెంకటేష్ ముదిరాజ్, గరిగె శేఖర్ ముదిరాజ్, వి. దీపిక ముదిరాజ్‌తో పాటు ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల' ముసాయిదా

బిల్లు సిద్ధం చేయండి

మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధవర్గాలతో సంప్రదింపుల ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రాథమిక ముసాయిదాను 3 నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని సూచించారు.

'రోహిత్ వేముల చట్ట రూపకల్పన ప్రక్రియకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ(ఎస్‌సీడీడీ) నాయకత్వం వహించాలని, అవసరమైన సంబంధిత శాఖలు, సంస్థలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని, న్యాయశాఖను భాగస్వామిగా చేర్చి వీలైనంత త్వరగా కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు. అవసరమైన న్యాయపరమైన, సాంకేతిక అంశాల్లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని నిర్ణయించారు.

రాయచోటి అభివృద్ధిపై చర్చకు రావాలి

-శ్రీకాంత్‌రెడ్డికి మండిపల్లి సవాల్

రాయచోటి, రాయచోటి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. నేను చేసిన పనులు నేరుగా ప్రజల ముందే చూపిస్తా.. గతంలో నువ్వు చేసిన పనులేంటో చూపించే దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు.
రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ, తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో సహా వివరించారు.
గత 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రూ.450 కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద ఆరు మండలాలకు తాగునీటి ప్రాజెక్టు, రూ.420 కోట్ల అంచనాతో 25 వేల ఎకరాలకు సాగునీరందించే శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమృత్ పథకం నిధులను వెనక్కి పంపించిందని ఆయన విమర్శించారు.
ఎన్నికలు రాగానే శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తల పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయాక రాయచోటి మొహం చూడని వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతున్నారు. నీకు దమ్ముంటే రానున్న 40 రోజులు ఇక్కడే ఉండి కార్యకర్తలకు అండగా నిలబడు అని సవాల్ చేశారు
. తాను 22 ఏళ్లుగా ప్రజల్లో ఉంటూ కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎవరి కాళ్లూ పట్టుకోలేదని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

సింగరేణి స్కామ్‌లపై ఎంక్వైరీకి రెడీ..

సింగరేణిలో టన్నుకు రూ.3,800 చొప్పున కోల్‌ను వదిలిపెట్టి టన్నుకు రూ.10 వేల నుంచి 12 వేల కమీషన్లు దండుకొనేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి పెద్ది స్వప్న, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డితో కలిసి కేటీఆర్ నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెద్దిని పోరాట స్ఫూర్తిగా తీసుకొని పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా ముందుకెళ్లి నర్సంపేట గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.
రేవంత్ ఈఎంఈ సీఎం
'రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. ఈఎంఐ ముఖ్యమంత్రి' అని కేటీఆర్ ఎద్దేవాచేశారు. ప్రతినెలా ఢిల్లీ పెద్దలకు కప్పంగట్టి తన పదవిని రెన్యువల్ చేయించుకుంటున్నారని దెప్పిపొడిచారు. కప్పం కట్టకుంటే రికవరీ ఏజెంట్ లాంటి తెలంగాణలోని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఆయన సీఎం కుర్చీని గుంజి పడేస్తాడని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి నుంచి ఈఎంఐలు కట్టించుకొనేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఏఐసీసీ జనరల్ సెక్రటరీని నియమించిందని, కప్పంకట్టి పదవిని కాపాడుకొనేందుకే తెలంగాణ సంపదను రేవంత్ లూటీ చేస్తున్నాడని నిప్పులు చెరిగారు.
ఏపీలో జల పండుగ.. ఇక్కడ జల గండం..
700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే అడ్డుకోవాల్సిన రేవంత్‌రెడ్డి కండ్లప్పగించి చూశారని కేటీఆర్ దుయ్యబట్టారు. 'తెలంగాణ నుంచి కిందికిపోయిన నీళ్లతో ఆంధ్రప్రదేశ్‌లో జల పండుగ కనిపిస్తున్నది.. కానీ తెలంగాణ మాత్రం జలగండంలో చిక్కుకున్నది..ఇందుకు రేవంత్ సర్కార్ అసమర్థతే కారణం' అని విమర్శలు గుప్పించారు. ఎల్ నినో వచ్చిందని మన ముఖ్యమంత్రి చేతులెత్తేస్తున్నాడని దుయ్యబట్టారు.ఎల్ నినో దేశమంతటా ఉన్నదని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోనూ ఉన్నదని చెప్పారు. అక్కడి ప్రభుత్వాలు కరువు సన్నద్ధత చర్యల్లో నిమగ్నమవుతుంటే రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజాధనాన్ని లూటీ చేయడంలో బిజీగా ఉన్నాడని ఎద్దేవాచేశారు. ఏపీ సీఎం 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పందాకా నీళ్లు తీసుకుపోయారని, 400 టీఎంసీలను పట్టిసీమ పంపులతో ఎత్తిపోస్తున్నారని, పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రా ప్రాజెక్టులన్నింటినీ నీళ్లతో నింపుకొంటున్నారని గుర్తుచేశారు.ఏపీ సీఎం చంద్రబాబు 700 కిలోమీటర్ల దాకా నీళ్లు తీసుకెళ్తే..మన ముఖ్యమంత్రికి మాత్రం 70 కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌నగర్‌కు కూడా నీళ్లు తీసుకెళ్లడం చేతగావడం లేదని చురకలంటించారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుల నుంచి నీటి ఎత్తిపోతలతో ప్రస్తుత దుర్భిక్షంలోనూ తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుండేదని చెప్పారు.

ఎంపీ మిథున్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్

అమరావతి,స్థానిక సంస్థల ఎన్నికలు నామినేషన్ సందర్భంగా శుక్రవారం పుంగనూరు లో జరిగిన దాడి ఘటనపై ఎంపీ మిథున్ రెడ్డి కి వైఎస్ జగన్ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరపాలన్న ఉద్దేశం చంద్రబాబుకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల పరిపాలనపట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత.. ఓటమి భయంతోనే అరాచకాలు, దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. హింసా రాజకీయాలు చంద్రబాబుకు కొత్తేమీ కాదన్న వైఎస్ జగన్ రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌లా మార్చారన్నారు. లోక్‌సభలో పార్టీ నాయకుడికే భద్రతలేని పరిస్థితులు చూస్తున్నాం. చంద్రబాబు అధికార దుర్వినియోగంతో పోలీసులను వాడుకుని అక్రమాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
దాడులు జరుగుతున్న పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండిపోతోంది. ఈ అన్యాయాలను సమర్థంతంగా ఎదుర్కొంటాం. చట్టపరంగా అన్ని రకాలుగా పోరాటం చేస్తాం. ధైర్యం, సహనంతో ఈ ఎన్నికలను ఎదుర్కొంటాం. రాష్ట్రంలో పరిస్థితులను, పారామిలటరీ బలగాలతోనే ఎన్నికలు సజావుగా సాగుతాయనే విషయాన్ని కోర్టుల ముందు ఉంచుతామని తెలిపారు. హింసతో రాష్ట్రాన్ని నాశనంచేస్తున్న చరిత్ర చంద్రబాబుదని వైఎస్ జగన్ విమర్శించారు.

ఎంపీ మిథున్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్

రెండున్నరేళ్ల పరిపాలనపట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత.. ఓటమి భయంతోనే అరాచకాలు, దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. హింసా రాజకీయాలు చంద్రబాబుకు కొత్తేమీ కాదన్న వైఎస్ జగన్ రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌లా మార్చారన్నారు. లోక్‌సభలో పార్టీ నాయకుడికే భద్రతలేని పరిస్థితులు చూస్తున్నాం. చంద్రబాబు అధికార దుర్వినియోగంతో పోలీసులను వాడుకుని అక్రమాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దాడులు జరుగుతున్న పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండిపోతోంది. ఈ అన్యాయాలను సమర్థంతంగా ఎదుర్కొంటాం. చట్టపరంగా అన్ని రకాలుగా పోరాటం చేస్తాం. ధైర్యం, సహనంతో ఈ ఎన్నికలను ఎదుర్కొంటాం. రాష్ట్రంలో పరిస్థితులను, పారామిలటరీ బలగాలతోనే ఎన్నికలు సజావుగా సాగుతాయనే విషయాన్ని కోర్టుల ముందు ఉంచుతామని తెలిపారు. హింసతో రాష్ట్రాన్ని నాశనంచేస్తున్న చరిత్ర చంద్రబాబుదని వైఎస్ జగన్ విమర్శించారు.

భక్తులకు సౌకర్యాలే ప్రాధాన్యం

విజయవాడ ఇంద్రకీలాద్రి, అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం అమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మంత్రి తొలుత ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.గతంలో మూలా నక్షత్రం రోజున శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారని, క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన ప్రక్రియను మరింత సులభతరం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ఏడాది దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు సైతం ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, ప్రశాంతంగా, తృప్తిగా దర్శనం చేసుకుని తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలన్న సత్సంకల్పంతో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.దసరా ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ, వారికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

సొసైటీల్లోని నిధులపై కాంగ్రెస్ పెద్దల కన్ను

వివిధ జిల్లాల నుంచి వచ్చిన సొసైటీ చైర్మన్లు తెలంగాణ భవన్‌లో శుక్రవారం కేటీఆర్‌ను కలిశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడం సరికాదని చెప్పారు.
బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కృషి వల్లే సహకార సంఘాలు అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో సహకార సంఘాల్లో రూ.13 వేల కోట్లు ఉంటే తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో 73 వేల కోట్ల నిధులకు చేరాయని తెలిపారు. సహకార సంఘాల సభ్యులు, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 908 సొసైటీల్లో రూ.కోటి నుంచి రూ.50 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని, ఆ నిధులపై కాంగ్రెస్ పెద్దల కన్ను పడిందని ఆరోపించారు. రాష్ట్రంలోని సహకార సంఘాలు,
సహకార బ్యాంకులకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు కోరారు.సహకార రంగం ఎదురొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్ ఎన్నికల కోసం సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ల రాష్ట్ర ఫోరం నాయకులు కొండూరి రవీందర్‌రావు,
నలిమెల అశోక్, మధుకర్, మురళి, పరమేశ్వర్‌రెడ్డి,
రఘువర్ధన్‌రెడ్డి, రాజుయాదవ్, మేడ్చల్ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, టీఎస్‌టీవోబీ మాజీ చైర్మన్ రవీందర్‌రావు, సహకార సంఘాల జేఏసీ నేత అశోక్ తదితరులు ఉన్నారు.

వైసీపీ అరాచకాలపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఆగ్రహం



విజయవాడ, అక్టోబర్ 16: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో కూటమి నాయకులపై వైసీపీ నేతలు దాడులకు దిగడంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో హింసాత్మక రాజకీయాలను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. తొలి రోజు నామినేషన్ ఘట్టంపై వైసీపీ ప్రజాస్వామ్యాన్ని కుళ్ళబొడిచిందని మాధవ్ మండిపడ్డారు.

శుక్రవారం పీవీఎన్ మాధవ్ మీడియాతో మాట్లాడుతూ..' వైసీపీ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెబుతారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, రాష్ట్రంలో కూటమి సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. శాంతియుత ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటాం. 2024 ప్రజా తీర్పును స్థానిక ఎన్నికల్లో పునరావృతం చేస్తాం. ఓటమి భయంతో తిరుపతి, పుంగనూరు, రాయచోటిలో వైసీపీ నేతలు అరాచకాలు సృష్టిస్తున్నారు. మిథున్ రెడ్డి వాహనంతో కార్యకర్తలను ఢీకొట్టేలా వేగంగా వెళ్లడం, అడ్డుకున్న వారిపై దాడులకు ప్రయత్నించడం వంటి ఘటనలు ఆందోళనకరం' అని మాధవ్ అన్నారు.తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు మహిళా అభ్యర్థుల నామినేషన్లకు ఆటంకం కలిగించారని మాధవ్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించదనే భయంతోనే ప్రతిపక్షం భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ధర్మవరంలో బీజేపీ శ్రేణులపై వైసీపీ తీరుపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన హత్యా రాజకీయాలు, ప్రస్తుత అరాచకాలకు ప్రజలు మద్దతు ఇవ్వరని ఆయన స్పష్టం. హింసకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతామని మాధవ్ వెల్లడించారు.అన్ని స్థానాల్లో ఐక్యంగా పనిచేస్తూ అఖండ మెజారిటీ సాధిస్తామని, 2024 ఎన్నికల ప్రజా తీర్పును పునరావృతం చేస్తామని బీజేపీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, హింసకు తావులేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కోవాలని మాధవ్ పిలుపునిచ్చారు. చౌకబారు రాజకీయ ఎత్తుగడలకు పాల్పడితే సహించేది లేదని, ప్రజలను భయపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు మానుకోవాలని పీవీఎన్ మాధవ్ హెచ్చరించారు.

పుంగనూరులో వైసీపీ దాడులపై ఎస్ఈసీకి ఫిర్యాదు..

కోడ్ ఉల్లంఘించిన వైసీపీ ఎంపీ: వర్ల రామయ్య



అమరావతి, అక్టోబర్16: పుంగనూరులో వైసీపీ దాడులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు అన్ని ఆధారాలు అందించామని టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను టీడీపీ నేత పరుచూరి అశోక్ బాబుతో పాటు ఆయన కలిశారు. అనంతరం కార్యాలయం బయట ఎమ్మెల్సీ వర్ల రామయ్య విలేకర్లతో మాట్లాడుతూ.. అంత పెద్ద కాన్వాయ్‌తో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే వాళ్లతో ఏకంగా 32 కార్లతో వెళ్లి ఎన్నికల నియమావళిని ఎంపీ మిథున్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రంలోకి కేవలం రెండు కార్లు, అభ్యర్థితో కలిపి ఐదుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు. నామినేషన్ కేంద్రం వద్ద తమ వాళ్లపై కర్రలతో దాడులకు పాల్పడి, వాహనాల అద్దాలను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.పుంగనూరులో అల్లర్లు సృష్టించేందుకు తమిళనాడు (తిరుత్తణి), కర్ణాటక రాష్ట్రాల నుంచి రౌడీషీటర్లను బరిలోకి దించారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ఈ దౌర్జన్యాలు, అరాచకాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోల ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునీఠాకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.దౌర్జన్యాలు, గూండాయిజంతో ఎన్నికల్లో గెలవాలని చూస్తే ఈ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం చూస్తూ ఊరుకోదని వైసీపీ నేతలకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. మళ్లీ ఇలాంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ప్రభుత్వం, వ్యవస్థలు కఠినంగా అణచివేస్తాయని టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య హెచ్చరించారు.

రాహుల్ గాంధీ దాదాగిరి చేస్తున్నారా?..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 16: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ దేశంలో దాదాగిరి చేస్తున్నారా అని ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వదిలిపెట్టబోమని రాహుల్ అనడం సరికాదన్నారు. దమ్ముంటే ఎన్నికల్లో గెలవాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.దేశంలో ఓట్ చోరీ జరగలేదని, చోరులకు ప్రజలు ఎప్పుడూ ఓటు వేయరని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'సర్'తో సంబంధం లేకుండానే గతంలో బీజేపీ ఘన విజయం సాధించిందని గుర్తుచేశారు. ఇదే సమయంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌ను రాజకీయాల్లోకి లాగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ యువత హృదయాల్లో ధోవల్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన పేరు చెబితేనే పాకిస్థాన్ గుండెల్లో రైళ్లు పరిగెడుతాయని ఆయన తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం గొప్ప వ్యక్తులను వివాదాల్లోకి లాగడం కాంగ్రెస్ పార్టీకి తగదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హితవు పలికారు.


పుంగనూరు దాడులపై వైసీపీకి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వార్నింగ్



తిరుపతి, అక్టోబర్ 16: టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ దాడులపై తిరుపతిలో ఆయన స్పందించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలకు కౌంటర్ ఇచ్చారు. వైసీపీ నిజంగానే గొడ్డలి పార్టీగా మారిపోయిందని విమర్శించారు. పుంగనూరులో వాహనాలను మనుషులపైకి ఎక్కించారని మండిపడ్డారు.తాగి రౌడీయిజం చేస్తే ఇక తాము చూస్తూ ఊరుకోమని వైసీపీ నేతలకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఓ రెడ్డిగా ఈరోజు మిథున్ రెడ్డి, అభినయ రెడ్డి చేసిన వ్యవహారాన్ని చూసి తాను ఖండిస్తున్నానని చెప్పారు. రాజకీయాలలో రెడ్లు ఇలా చేయరని తెలిపారు. వారు ప్రజా మద్దతు పొందుతారని పేర్కొన్నారు.గత ఐదేళ్లలో ప్రతి ఎన్నికల్లోనూ ఘర్షణలు, గుండాయిజం చేసింది వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి అని ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు సహనం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓర్పు చూసి చేతకానితనం అని వైసీపీ నేతలు అనుకుంటున్నారని తెలిపారు. ఇక నుంచి తాము సీఎం, డిప్యూటీ సీఎం మాట వినదలుచుకో లేదని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పారు.

దేశాన్ని అస్థిర పరిచేందుకు, ప్రభుత్వాన్ని కూల్చేందుకే ఆందోళనలు..

ఇండియా బ్లాక్‌పై రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణ



దేశాన్ని బంగ్లాదేశ్‌లాగా తగులబెట్టేందుకు, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకే ఇండియా బ్లాక్ కూటమి ఆందోళన చేసో?ందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యూపీలోని లక్నోలో జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మండిపడ్డారు. సర్ రద్దు చేయాలంటూ, సీఈసీ రాజీనామా చేయాలంటూ ఇండియా బ్లాక్ పార్టీలు ఇటీవల ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపైనే రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. "ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీసి, దేశాన్ని తగులబెట్టేలా ఇండియా బ్లాక్ ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. బంగ్లాదేశ్‌ను ఆదర్శంగా తీసుకున్న ప్రతిపక్షాలు అక్కడిలాగా ఇండియాలో కూడా ప్రభుత్వాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఇది వాళ్లు ప్రెస్ మీట్లలో బహిరంగంగానే చెబుతున్నారు. ప్రభుత్వాన్ని కూల్చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇందుకోసం దేశ యువతను పావులుగా వాడుకుంటోంది. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, రాజ్యాంగ వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు, దేశ అభివృద్ధి పథాన్ని అడ్డుకునేందుకు ప్రజాస్వామ్యం ఎవరికీ అనుమతి ఇవ్వదు అనే విషయాన్ని రాహుల్ గాంధీ, ఆయన మద్దతుదారులు గుర్తించాలి.

ఈ అంశంలో సుప్రీంకోర్టు ప్రస్తావించిన అంశాల్ని గుర్తించాలి.

శాంతి భద్రతల్ని కాపాడాలంటే చట్టాన్ని గౌరవించాలి. రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యవస్థలు బలికాకూడదు. ఈ వాస్తవాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలి. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో క్షమించరాని నేరం. ఆ తర్వాత 1984లో జరిగిన అల్లర్లకు కూడా కాంగ్రెస్ పార్టీనే కారణం. 1990లో తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి రామ భక్తులు, కరసేవకుల రక్తాన్ని చిందించారు" అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాకాబందీ..

అదుపులో 48 మంది: సీపీ సజ్జనార్



హైదరాబాద్, అక్టోబర్16: నగరంలో గత అర్ధరాత్రి 'ఆపరేషన్ కవచ్' పేరిట పోలీసులు ప్రత్యేక నాకాబందీ నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లో తెలిపారు. దాదాపు 100కుపైగా బృందాలతో ప్రత్యేక నాకాబందీ నిర్వహించామని చెప్పారు. 3 వేల మంది పోలీసులతో విస్తృత తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో 725 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు.ఈ ఆపరేషన్ కవచ్‌లో 5 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక ఈ తనిఖీల్లో ఓ ఆయుధం స్వాధీనం చేసుకోగా.. రెండు గంజాయి కేసులు నమోదు చేశామని చెప్పారు. అయితే ఈ తనిఖీల్లో అత్యధికంగా గోల్కొండ జోన్‌లో సరైన పత్రాలు లేని 213 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. జూబ్లీహిల్స్ జోన్‌లో 18 వాహనాలు డిటైన్.. 8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.నంబర్ ప్లేట్లు తారుమారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లను స్పష్టంగా ఉంచుకోవాలంటూ వాహనదారులకు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

అభిజీత్ దీప్కే, నేహా బోరాను అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు..

నిరసన ప్రదేశంలో కఠిన ఆంక్షలు



లెహ్రో దో తిరంగా పేరుతో శుక్రవారం సాయంత్రం ర్యాలీ చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఈ ర్యాలీకి వెళ్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్కేను ఢిల్లీ, ఝండేవాలన్‌లోని నివాసం నుంచి అదుపులోకి తీసుకోగా.. నేహా బోరాను మండి హౌజ్ నుంచి అరెస్టు చేశారు.వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంటున్న సమయంలో ఉద్రిక్తత తలెత్తింది. అటు పోలీసులు, ఇటు మీడియా.. మధ్యలో దీప్కే మద్దతుదారులతో ఈ ప్రదేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీప్కేను పోలీసులు అరెస్టు చేసి, తమ వాహనంలో తీసుకుని వెళ్లారు. అంతకుముందు దీప్కేకు ఢిల్లీ పోలీసులు రెండు వేర్వేరు నోటీసులు ఇచ్చారు. సెంట్రల్ పార్క్ వద్ద దీక్షకు వెళ్లకూడదని సూచిస్తూ.. ఢిల్లీ పోలీస్ యాక్ట్ కింద పోలీసులు ఒక నోటీస్ జారీ చేశారు. అనంతరం.. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద సౌత్ వెస్ట్ ఢిల్లీ పోలీసులు మరో నోటీస్ జారీ చేశారు.ఈ సమయంలో దీప్కే నివాసం వద్ద భారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. తన అరెస్టు సమయంలో దీప్కే పోలీసులతో ఘర్షణకు దిగారు. సెంట్రల్ పార్క్ వద్ద ఆందోళన చేయడానికి వీల్లేదన్న పోలీసులతో.. మరో చోటును చూపించాల్సిందిగా కోరాడు. మరో ప్రదేశం గురించి తర్వాత చెబుతామని, ఇప్పుడు అదుపులోకి తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. తానేమీ చట్టాన్ని ఉల్లంఘించడం లేదని, తనను ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మరోవైపు ఈ రోజు నిరసన జరగాల్సి ఉన్న కన్నాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ను పోలీసులు మూసివేశారు. పార్క్ వద్ద ఆంక్షలు విధించారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.దీంతో సెంట్రల్ ఢిల్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ ఆందోళన నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ రెండు రోజులక్రితం ఢిల్లీ పోలీసులు సీజేపీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు ఐదు రోజుల జుడిషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం ఇద్దరూ తిహార్ జైలులో ఉన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే

అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు ప్రత్యేక కార్యక్రమం
లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలి: డాక్టర్ విజయ నిర్మల



హనుమకొండ అక్టోబర్ 16: కుష్టు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు నిర్వహించే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ విజయ నిర్మల సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించాలని ఆదేశించారు.కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి బహుళ ఔషధ చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ శరీరంపై స్పర్శజ్ఞానం తగ్గిన తెల్లటి లేదా రాగి రంగు మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధి వంశపారంపర్యం కాదని, ప్రజలు అపోహలు వీడి సర్వేకు సహకరించాలని కోరారు.అనంతరం వైద్యాధికారులకు జూమ్ ద్వారా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, కొప్పు ప్రసాద్, శ్రీనివాస్, యెల్లయ్య, రవీందర్, దేవ్ సింగ్, సువార్త తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాత అలంకరణలో భద్రకాళి అమ్మవారు

- వైభవంగా గంధోత్సవం, సాలభంజిక సేవ
-నేడు ఆలయంలో నూతన రథం సమర్పణ

వరంగల్ అక్టోబర్ 16: చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు శుక్రవారం అమ్మవారిని భవానీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాత్యాయని, ధూమ్రహా క్రమాల్లో పూజలతో పాటు గంధోత్సవం, సాయంత్రం సాలభంజిక సేవ నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్--రేవతి దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ కె. వెంకన్న కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు పర్యవేక్షించారు.శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి--నీలిమ దంపతులు నూతన రథాన్ని ఆలయానికి సమర్పించనున్నారని, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలుపాల్గొన్న ఎస్పీ



భువనగిరి అక్టోబర్ 16 భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని డీఏఆర్ (ణూ=) హెడ్‌క్వార్టర్స్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరై పోలీస్ మహిళలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.పోలీస్ మహిళలు తమ పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించి తెలంగాణ వైభవాన్ని చాటారు.పాటలు, ఆటలు, సంప్రదాయ వేడుకలతో డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. పోలీస్ కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు ఉల్లాసంగా సాగాయి.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరమని ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న పోలీస్ మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఉద్యోగులకు ఐదు శాతం ఇంక్రిమెంట్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఉద్యోగులను విస్మరించొద్దు

ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు



హైదరాబాద్ అక్టోబర్ 16: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఐదు శాతం ఇంక్రిమెంట్ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన ప్రత్యక్షంగా హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో సుమారు 17,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండే వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా భరిస్తున్నాయని ఈటల గుర్తుచేశారు. గతంలో తాను రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవంతో ఈ విషయంపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను కేటాయించే అవకాశం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. నిధుల కొరతను సాకుగా చూపకుండా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సూచించారు.

రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఐదు శాతం ఇంక్రిమెంట్ అమలు చేసి ఉద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.
కరోనా మహమ్మారి సమయంలో కుటుంబ సభ్యులే బయటకు రావడానికి భయపడిన పరిస్థితుల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలు అందించారని ఈటల గుర్తుచేశారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమించిన ఉద్యోగుల సేవలను ప్రభుత్వం మరచిపోవద్దన్నారు. అలాంటి ఉద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి నిరవధిక సమ్మె చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

ఉద్యోగులు రోజుల తరబడి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడాన్ని ఈటల తప్పుపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరపాలని కోరారు. ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆవేదనను తక్కువ అంచనా వేయవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రజాస్వామ్యబద్ధంగా తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఉద్యోగుల పోరాటానికి తన మద్దతు ఉంటుందని ఈటల రాజేందర్ తెలిపారు.
ఈ సమ్మె కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ పుట్ట, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ భవానీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్, డాక్టర్ సంగీతతో పాటు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు సహకరించాలి

సాగునీటి కొరత నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండాలి

దుబ్బాకలో 2,111 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ

179 మంది లబ్ధిదారులకు రూ.1.79 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



సిద్దిపేట అక్టోబర్ 16: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో ప్రజలంతా ఏకమై కరోనా మహమ్మారిని ఎదుర్కొన్నట్లుగానే, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు.శుక్రవారం దుబ్బాక నియోజకవర్గంలోని దుబ్బాక, భూంపల్లి--అక్బర్‌పేట, మీర్దొడ్డి, రాయపోలు, దౌల్తాబాద్, తొగుట మండలాలకు చెందిన 2,111 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అదేవిధంగా 179 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మొత్తం రూ.1,79,20,000 విలువైన చెక్కులను అందజేశారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా గుడిసెల్లో నివసించకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మరో మూడు వేల ఇళ్లను మంజూరు చేయనున్నామని వెల్లడించారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గృహజ్యోతి, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాల ద్వారా పేదలకు ప్రయోజనం కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, త్వరలో కొత్త ఆసరా పింఛన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ద్వారా రూ.414 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.23 వేల కోట్లతో రుణమాఫీ చేపట్టిందని వివరించారు.

నీటి లభ్యతను బట్టే పంటల సాగు చేపట్టాలి

ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జూన్ వరకు వర్షపాత పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.
సాగునీటి కొరత నేపథ్యంలో వరి సాగుకు దూరంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సబ్‌కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 15 వేల మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 20 వేల మెగావాట్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల వ్యవసాయ బోర్లు ఉన్నాయని, వ్యవసాయానికి 9 గంటల 30 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు.

పెండింగ్ ఇళ్లను అర్హులైన స్థానికులకు కేటాయించాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న వాటికి ప్రస్తుతం పట్టాలు అందించడం సంతోషకరమన్నారు. ఇతర జిల్లాలకు చెందిన అనర్హులు ఇళ్లలో ఉంటే వారిని గుర్తించి, అర్హులైన స్థానిక లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు చివరి దశలో ఉన్నందున అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని కోరారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధ మల్ల ఆనంద్ గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో ఘనంగా 'రోడ్డు భద్రత వారోత్సవాలు'



కరీంనగర్ ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం 'సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో 'రోడ్డు భద్రత వారోత్సవాల' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ ప్రోగ్రాంకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధ మల్ల ఆనంద్ గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథులుగా హాజరై, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రతపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని,. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. "హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, పరిమితికి మించి వేగంతో వెళ్లకుండా ఉండడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని, ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు.బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఓ బి సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందికట్ల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆడిచర్ల రాజు, ఓబీసీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పెరక సురేష్ ,వెస్ట్ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, రాచకొండ కొమురయ్య, గుజ్జ శ్రీనివాస్ , హరీష్,గర్దాస్ సతీష్, వంగల రవి గోపాల్, టంగుటూరు రాజ్ కుమార్, ముత్యాల రవీందర్, నరాల రాజశేఖర్, పొన్నం రాము, కొట్టాల మల్లేష్, శ్రీవర్తి ప్రవీణ్, పనికిరా రమేష్ తదితరులు పాల్గొన్నారు

జనాభా గణన--2027 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జనాభా గణనను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి:

కామారెడ్డి జిల్లాలో జనాభా గణన--2027 రెండవ దశకు సంబంధించి సెన్సెస్ ఛార్జ్ క్లర్క్‌లు, సాంకేతిక సహాయకులకు రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో జిల్లాలోని 25 మండలాలు, 4 మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జనాభా గణన అత్యంత కీలకమైన జాతీయ కార్యక్రమమని, ఇందులో ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. శిక్షణా తరగతులను సిబ్బంది సద్వినియోగం చేసుకొని, జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

శిక్షణలో భాగంగా జనాభా గణనకు సంబంధించిన 40 రకాల ప్రశ్నలు, వాటి ద్వారా సమాచార సేకరణ విధానం, స్వీయ గణన ప్రక్రియ, సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్‌లో చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా గణాంకాల అధికారి కార్యాలయానికి చెందిన మాస్టర్ ట్రైనర్లు భుక్య రవికుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు, సెన్సెస్ ఛార్జ్ క్లర్క్‌లు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు

వరంగల్ కమిషనరేట్ లో ఆటపాటలతో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

వరంగల్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు కానిస్టేబుళ్ల నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల కోసం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవితతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సెంట్రల్ జోన్ డీసీపీలు స్వయంగా సంప్రదాయ పాటలను ఆలపిస్తూ, మహిళా సిబ్బందితో కలిసి నృత్యాలు చేస్తూ మహిళా పోలీసు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మనం ఎంత ఆధునిక జీవనశైలికి అలవాటు పడినా, మన మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోకూడదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్విరామంగా బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, హైదరాబాద్ వంటి మహానగరాలతో పోలిస్తే వరంగల్‌లోనే బతుకమ్మ ఉత్సవాలను ఎంతో ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని పోలీస్ కమిషనర్ అన్నారు.





ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం

వివిధ రకాల సహజసిద్ధ పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మను తయారు చేసిన బరోసా సెంటర్ సిబ్బంది కి మొదటి బహుమతిని ఇస్తూ అలాగే బతుకమ్మ పాటలను పాడిన సుబేదారి పోలీస్ స్టేషన్కు చెందిన మహిళా కానిస్టేబుల్ స్వప్నను కమిషనర్ అభినందిస్తూ, ఆమెకు ప్రత్యేక బహుమతి ప్రధానం చేశారు.

సంప్రదాయానికి అనుగుణంగా, వినూత్న రీతిలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో మహిళా సిబ్బంది తమ బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ భక్తిశ్రద్ధలతో గంగాప్రవేశం నిర్వహించి, గౌరమ్మకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ కి, సెంట్రల్ జోన్ డిసిపి ధార కవితకి, అడిషనల్ డిసిపి(పరిపాలన) రాయల ప్రభాకర్ రావు కి, అడిషనల్ డిసిపి (ఎఆర్) సురేష్ కి, అడిషనల్ డిసిపి (ఎఆర్) వేముల శ్రీనివాస్ కి, అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, యం.టి ఆర్ఐ శ్రీధర్, ఆర్ ఎస్సై శ్రావణ్ మిగతా సిబ్బందికి మహిళా సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అన్నపూర్ణేశ్వరిగా శాలినీనగర్ పోచమ్మ

వరంగల్

చారిత్రక ఓరుగల్లు నగరంలోని శాలినీనగర్ లేబర్ కాలనీ పోచమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు నయనానందకరమైన శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి దివ్య అలంకారంలో భక్తజనకోటికి దర్శనమిచ్చి పునీతులను చేశారు. లోకకల్యాణార్థం ఆలయ ప్రధాన అర్చకులు ఈగ ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, పూజాదికాలు శాస్త్రోక్తంగా, కనులపండువగా నిర్వహించారు. దీక్షాధారణ చేసిన భక్తులకు పురోహితులు నియమనిబంధనలను విశదీకరిస్తూ వారిలో ఆధ్యాత్మిక చింతనను మరింతగా పెంపొందించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో యువత సైతం ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని దైవసేవలో తరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా జరిగిన అమ్మవారి గ్రామోత్సవం:

కాగా, గురువారం సాయంత్రం శాలినీనగర్‌లో అమ్మవారి గ్రామోత్సవం (నగర ఊరేగింపు) అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. జై భవానీ యూత్ సభ్యులు ముందుండి, అమ్మవారి పల్లకీని అత్యంత అట్టహాసంగా, భక్తుల జయజయధ్వానాల నడుమ ఊరేగింపుగా నడిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి ధన్యులయ్యారు. ఈ గ్రామోత్సవ వేడుకను జై భవానీ యూత్, ఆలయ అభివృద్ధి శాశ్వత కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బెజ్జంకి వీరస్వామి, ఉపాధ్యక్షుడు బొంగారి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి నందిగి సారంగపాణి, కోశాధికారి చింతల రవి, కార్యదర్శి గొడుగు చందర్, అలాగే



కార్యవర్గ సభ్యులు టీవీ శ్రీనివాస్, కందుకూరి చంద్రమౌళి, తిప్పన సతీష్ కుమార్, మేర్గు సాంబమూర్తి, ఉత్సవం దిగ్విజయంగా సాగేలా కృషి చేశారు.

బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు లక్కీ డ్రా

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో పారదర్శకంగా లక్కీ డ్రా ప్రక్రియ



కామారెడ్డి జిల్లా ప్రతినిధి:

కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు సంబంధించి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. నూతన బార్ కేటాయింపునకు మొత్తం 90 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ఎల్లారెడ్డికి చెందిన అతినారపు భైరవ స్వామి విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు. లక్కీ డ్రాలో టోకెన్ నంబర్ 1కు బార్ కేటాయింపు లభించినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి తెలిపారు.

ఈ దేశ ఆరోగ్యానికి వెన్నుముక ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు

టాస్క్ జిల్లా కన్వీనర్,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ బాలు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి:

కామారెడ్డి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక దీక్షకు సంఘీభావాన్ని టాస్క్ జిల్లా కన్వీనర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ బాలు తెలిపి వారి న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమంలో డాక్టర్ బాలు మాట్లాడుతూ ఈ దేశ ఆరోగ్యానికి వెన్నుముక ఎన్ హెచ్ ఎమ్ ఉద్యోగులు అని వారికి శాశ్వత ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలను కల్పించాల్సిన అవసరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అన్నారు.పేదలకు అన్నివేళలా అండగా ఉంటూ ప్రభుత్వ వైద్యశాలల పట్ల నమ్మకం ప్రజల్లో కలిగే విధంగా నిర్విరామంగా కృషి చేస్తున్న వీరి సేవలకు తగిన వేతనాలను సదుపాయాలను కల్పించాలని అన్నారు. ఈ దేశ ఆరోగ్య అభివృద్ధికి కారణమైన ఈ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని,పోరాట బాటతోనే సమస్యల పరిష్కారం ఉంటుందనే విషయాన్ని ఉద్యోగులు గుర్తుంచుకోవాలని అన్నారు.

బాన్సువాడ పట్టణంలో స్వీట్ షాపులు, బేకరీలపై ప్రత్యేక తనిఖీలు



కామారెడ్డి,: భారతీయ స్వీట్లు మరియు బేకరీ ఉత్పత్తులపై ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా, శుక్రవారం రోజున ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి.విక్రమ్ బాన్సువాడ పట్టణంలోని పలు స్వీట్ షాపులు మరియు బేకరీలలో తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సంద ర్భంగా పలు ఆహార వ్యాపార సంస్థలు ఎఫ్ఎస్ఎస్ఎఐ రిజిస్ట్రేషన్ / లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించడం జరిగింది. అలాగే పలు పరిశుభ్రత లోపాలు కూడా గుర్తించబడ్డాయి. తనిఖీలలో అనుమా నాస్పదంగా ఉన్న ఆహార నమూనాలను అక్కడికక్కడే సేకరించి విశ్లేషణ నిమిత్తం ల్యాబొరేటరీకి పంపడం జరిగింది.పరిశుభ్రత పాటించని మరియు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ / రిజిస్ట్రేషన్ లేని ఆహార వ్యాపార నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడం జరిగింది.ప్రజలు పరిశుభ్రత పాటించే దుకాణాల నుండి మాత్రమే ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు చేసే ముందు లేబుల్స్ ను సరిగ్గా చదివి తెలుసుకోవాలని సూచించడమైనది.

నెల్లూరులో వైసీపీకి గట్టి షాక్

నెల్లూరు, అక్టోబర్16: వైసీపీలో నేతలతోపాటు వారి అనుచరగణం రాజీనామాల పర్వం కొనసాగుతోంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు దాదాపుగా ఇదే పరిస్థితి. దీంతో ఆ పార్టీకి వరుసగా షాకుల మీద షాకులు తగులుతున్నాయి. తాజాగా నెల్లూరు నగరంలో సన్నపురెడ్డి సోదరులు టీడీపీలో చేరారు. శుక్రవారం మంత్రి నారాయణ, గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితోపాటు వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.. వారిందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
వైసీపీ నేతల ఒంటెద్దు పోకడలు నచ్చకే తామంతా టీడీపీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా సన్నపురెడ్డి సోదరులు ప్రకటించారు. అయితే సన్నపురెడ్డి సోదరులు వైసీపీని వీడి.. టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి నారాయణతోపాటు మిగిలిన నేతలకు సమాచారం అందింది. దీంతో వారంతా నెల్లూరులోని వారి కార్యాలయానికి స్వయంగా వెళ్లారు. అక్కడే సన్నపురెడ్డి సోదరులు టీడీపీలో చేరారు.దీంతో బాలా నారాయణరెడ్డి, జయపాల్‌తోపాటు వారి అనుచరగణమంతా టీడీపీ గూటికి చేరింది. స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగిన సంగతి తెలిసిందే. ఎన్నికల నామినేషన్ల ప్రకియ కూడా ప్రారంభమైంది. దీంతో వైసీపీని వీడి టీడీపీలో చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే పలు జిల్ల?ల్లో వైసీపీలో లీడర్ నుంచి కేడర్ వరకు గంపగుత్తగా రాజీనామాలు చేస్తున్నారు. వారంతా టీడీపీలో చేరుతున్నారు.

మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన శబ్దం వచ్చింది..!

దీనిపై విచారణ జరపాలి : మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు



మేడిగడ్డ బ్యారేజీపై మాజీ ఈఎన్సీ మురళీధర్ రావు సంచలన వ్యాఖ్యల చేశారు. మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన శబ్దం వచ్చింది దీని మీద ఇన్వెస్టిగేషన్ చేయండని కాంగ్రెస్ మంత్రుల సమక్షంలో స్పష్టం చేశారు. అక్టోబర్ 21, 2023న మేడిగడ్డ ఏడవ బ్లాకు దగ్గర బాంబు పేలినట్లు పెద్దగా శబ్దం వచ్చింది. పెద్ద చప్పుడు రావడంతో బాంబు పేలిందని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కూడా ప్రాథమిక విచారణ చేశారని వెల్లడించారు. మట్టి, ఇసుక కుంగడం వల్ల ప్రమాదం జరిగితే స్తంభాలకు పగుళ్లు రావని నిపులుణులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ రిపేర్లకు ఆసక్తి చూపించడం లేదన్నారు.అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్ర చేసినట్టు అప్పట్లో ఇంజినీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ కుట్రతోనే మేడిగడ్డ పిల్లర్లను బాంబుతో పేల్చారని బీఆర్ఎస్ నాయకులు సైతనం మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నారు. కాగా, మురళీధర్ రావు వ్యాఖ్యలతో మేడిగడ్డపై బలపడుతున్న బీఆర్ఎస్ నేతల అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పటికైనా ఇకనైనా విచారణ చేయాలని ఆయన అభ్యర్థించారు.

సీజేపీపై బ్రిజ్ భూషణ్ సంచలన ఆరోపణలు..

ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'లహరా దో తిరంగా' నిరసన ప్రదర్శనలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీఎ: ఎబజుూఖనెఅ ణవంని । 16 ూఖ్ 2026 7:13 ూవీ ూఘ్హుతీవ: సీజేపీపై బ్రిజ్ భూషణ్ సంచలన ఆరోపణలు.. అంతర్జాతీయ కుట్రపై అనుమానాలు దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'లహరా దో తిరంగా' నిరసన ప్రదర్శనలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నిరసనలపై భారతీయ జనతా పార్టీ మాజీ ఎంపీ, సీనియర్ నేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అత్యంత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీజేపీ ఆందోళనలు, నిరసనల వెనుక అంతర్జాతీయ బిలియనీర్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ హస్తం ఉందని, ఆయన ఆదేశాల మేరకే సీజేపీ ఉద్యమం నడుస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన బ్రిజ్ భూషన్ సీజేపీ ఆందోళనలను దేశానికి వ్యతిరేకంగా సాగుతున్న ఒక పెద్ద కుట్రగా అభివర్ణించారు. అమెరికాలో దారుణం.. విడిపోయిన భార్యను హత్య చేసిన భర్త! ఈ సందర్భంగా బ్రిజ్ భూషణ్ మాట్లాడుతూ, నిరసనల ముఖ్య ఉద్దేశం కేవలం రాజకీయ వ్యతిరేకత మాత్రమే కాదని, దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును భయపెట్టాలనే స్పష్టమైన దురుద్దేశంతోనే ఈ ర్యాలీలను ప్లాన్ చేశారని ఆరోపించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో సుప్రీంకోర్టును టార్గెట్ చేస్తూ ఇలాంటి ప్రదర్శనలు జరగడం ఎప్పుడూ చూడలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ ఆందోళనల ద్వారా భారతదేశంలో అశాంతిని సృష్టిస్తూ, మన దేశాన్ని బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల సరసన నిలబెట్టేలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో వ్యాపారం చేయాలని భావించే విదేశీ శక్తులు తమ సొంత నిబంధనలు, షరతులతోనే ఇక్కడ వ్యవహరించాలని చూస్తున్నాయని, అలాంటి వారే ఈ నిరసనలకు నిధులు అందిస్తూ ఆజ్యం పోస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. స్థానిక మార్కెట్ నిబంధనలు, పాలసీ నిర్ణయాలను అడ్డం పెట్టుకుని తన వ్యాపారాన్ని అడ్డుకుంటున్నారని భావిస్తున్న మస్క్, పరోక్షంగా రాజకీయ విమర్శలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్రంగా పరిగణించబడుతోంది.

। కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు..



: కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. సీఎంఎల్ఆర్ మనీ లాండరింగ్ కేసులో నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 23న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. మనీలాం డరింగ్ కేసులో కేరళ హైకోర్టును ఈడీ ఆశ్రయించింది. దీనిపై స్పందించిన కోర్టు.. ఈ కేసులో మాజీ సీఎం విజయన్‌తోపాటు ఆయన కూతురు వీణా విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ కోసం కోచిలోని తమ కార్యాలయంలో అక్టోబర్ 23న హాజరు కావాలని విజయన్‌ను ఈడీ ఆదేశించింది. అయితే, తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ విజయన్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. ఈ ఏడాది మేలో ఈడీ అధికారులు సీఎంఆర్ఎల్ సంస్థ ప్రమోటర్లపై దాడులు జరిపారు. దీనిలో భాగంగా విజయన్ కూతురు వీణా విజయన్ ఇంటిపై కూడా దాడులు జరిపారు. ఈ సందర్భంగా కొన్ని కీలక డాక్యుమెంట్లు లభించాయి. ఇండియా నుంచి భారీ ఎత్తున డబ్బు దుబాయ్, విదేశాలకు తరలించినట్లుగా ఆ డాక్యుమెంట్లలో ఉంది. 3.49 లక్షల యూఏఈ దిర్హామ్స్ (రూ.85 లక్షలు) దుబాయ్‌కు తరలించారు. అలాగే, ఇండియా నుంచి రూ.20.05 కోట్ల భారత కరెన్సీ కూడా విదేశాలకు తరలించారు. హవాలా లావాదేవీల ద్వారా ఈ సొమ్మును విదేశాలకు తరలించినట్లు ఈడీ అనుమానిస్తోంది. విజయన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన పాత్రపై కూడా ఈ విషయంలో అనుమానాలున్నాయి. ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎల్ సంస్థకు లబ్ధి చేకూరినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ అంశంపై విచారించేందుకు ఈడీ సిద్ధమైంది. పినరయి విజయన్, వీణా విజయన్‌పై కేసు నమోదు చేయాలని కోర్టును ఈడీ ఆశ్రయించింది. దీంతో తాజాగా పినరయి విజయన్‌కు సమన్లు జారీ చేసింది.

పుంగనూరును శ్మశానంగా మార్చాలని పెద్దిరెడ్డి కుటుంబం కుట్ర చేస్తోంది: ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడి



అమరావతి, అక్టోబర్ 16: పుంగనూరు నియోజకవర్గాన్ని పెద్దిరెడ్డి కుటుంబం శ్మశానంగా మార్చాలని కుట్రలు చేస్తోందని టీడీపీ ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పుంగనూరులో ఎప్పుడూ ఇలాంటి ఘర్షణలు, గొడవలు జరగలేదని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు హింసతో రాజకీయం చేసిన పెద్దిరెడ్డి కుటుంబం, ఇప్పుడు ప్రతిపక్షంలోనూ అదే పద్ధతిని కొనసాగిస్తోందని ఆరోపించారు.
గత ఎన్నికల్లోనూ పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం హింసాత్మక రాజకీయాలకు పాల్పడ్డిందని, 2005 నాటిలాగే ఇప్పుడు కూడా బయటి నుంచి మనుషులను తీసుకువచ్చి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో సుమారు 700 మందిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపి, ఆస్తులు ధ్వంసం చేసినప్పటికీ టీడీపీ కార్యకర్తలు భయపడలేదని అమర్‌నాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజాస్వామ్య విలువలు అంటే ఏంటో అస్సలు తెలియవని దుయ్యబట్టారు.
నేడు కూడా హింసా వాతావరణాన్ని సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఆ కుటుంబం కుట్రలు పన్నుతోందని, ఇలాంటి అరాచక శక్తులను ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి కుటుంబాన్ని బహిష్కరించాలని, ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవాలని అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

భర్తను చంపిన భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష..



భర్తను హత్య చేసిన భార్యకు, ఆమె ప్రియుడికి జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. ఈ మేరకు శుక్రవారం మీరట్ జిల్లా కోర్టులో అడిషనల్ జడ్జి 12 అయిన జైవీర్ సింగ్ నగర్ శిక్ష ఖరారు చేశారు. ఉత్తర ప్రదేశ్, మీరట్‌లో ఈ తరహా శిక్ష ఖరారు కావడం రెండు రోజుల్లో ఇది రెండోది. మొదటి కేసులో కూడా భర్తను హత్య చేసినందుకు భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష విధించింది మీరట్ జిల్లా కోర్టు. తాజా కేసులో మృతుడు అమిత్ కశ్యప్ కాగా.. అతడిని భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. గత ఏడాది ఏప్రిల్ 17న అమిత్ కశ్యప్‌ను అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అతడిని పాము కరవడం వల్లే చనిపోయాడని నమ్మించారు. ఈ విషయం అందరూ నమ్మేలా బెడ్ పక్కన ఒక పామును కూడా వదిలిపెట్టారు. అయితే, అతడు పాముకాటు వల్ల చావలేదని పోస్టుమార్టంలో తేలింది. అతడి ఒంటిపై పాము కాటు గాయాల్లేవని వైద్యులు అన్నారు. గొంతు నులమడం వల్లే అతడు మరణించాడని కూడా వైద్యులు ధృవీకరించారు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరపగా.. రవిత, అమర్‌దీప్ వ్యవహారం బయటపడింది. వారే హత్య చేసినట్లుగా తేలింది. దీనిపై స్థానిక జిల్లా అడిషన్ కోర్టు-12లో విచారణ జరిగింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేశారు. ఇంతకాలం కోర్టులో విచారణ జరగగా.. పలువురు సాక్షులను విచారించి, ఇద్దరూ హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. దీనిపై శుక్రవారం కోర్టు తీర్పు వెల్లడించింది. నిందితులు ఇద్దరూ వేర్వేరు జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి వారి నేరం, శిక్ష గురించి ప్రశ్నించారు. తాము చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నామని చెప్పారు. కోర్టు ఏ శిక్ష వేసినా చట్టపరంగా అనుభవించడానికి తాను సిద్ధమేనని రవిత తెలిపింది. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి బాధ్యతను ఇతరులు చూసుకుంటారని కోర్టుకు తెలిపింది. అమర్‌దీప్ మాత్రం తనకు వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారని, వారి సంక్షేమం చూసుకునే విషయంలో ఇబ్బంది రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం ఇద్దరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం వారికి మరణశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. రెండు రోజుల క్రితమే మీరట్, బ్లూ డ్రమ్ మర్డర్ కేసులో నిందితులు రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు కూడా మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రైతులు, ప్రజలు సహకరించాలి



సిద్దిపేట గతంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో ప్రజలంతా ఏకమై కరోనా మహమ్మారిని ఎదుర్కొన్నట్లుగానే, ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపుతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, అధికారుల సూచనల మేరకు పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. శుక్రవారం దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని దుబ్బాక, భూంపల్లి--అక్బర్‌పేట, మీర్దొడ్డి, రాయపోల్, దౌల్తాబాద్, తొగుట మండలాలకు చెందిన 2,111 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అలాగే 179 మంది లబ్ధిదారులకు రూ.1.79 కోట్ల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

పేదలకు ఇళ్లే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో పక్కా ఇళ్లు లేకుండా ఎవరూ గుడిసెల్లో నివసించకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టారని మంత్రి వివేక్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇళ్లను మంజూరు చేశామని, మరో 3 వేల ఇళ్లను అందించనున్నామని చెప్పారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరలో పూర్తవుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేదలకు ప్రయోజనం చేకూర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రూ.414 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని పేర్కొన్నారు. గృహజ్యోతి, సన్నబియ్యం తదితర పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, త్వరలో కొత్త ఆసరా పింఛన్లు అందించనున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.23 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేపట్టిందని చెప్పారు.



గ్యాప్-డౌన్ నష్టాల నుంచి లాభాల్లోకి..

ముంబై, మే 4: అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో ఇవాళ (గురువారం) భారీ నష్టాలతో (+ఛజూ–ుశీఎఅ ాజూవఅ) ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. తర్వాత అద్భుతమైన రీబౌండ్ సాధించాయి. ఉదయం ప్రారంభంలో సెన్సెక్స్ దాదాపు 490 పాయింట్లు, నిఫ్టీ 130 పాయింట్ల వరకు నష్టపోయినప్పటికీ, తక్కువ స్థాయిల దగ్గర లభించిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు నష్టాల నుంచి లాభాల్లోకి మళ్లాయి.ఉదయం 10:28 గంటల సమయానికి నిఫ్టీ 50 (చీఱట్ఎ 50) గత ముగింపు (23,405.60) కంటే 23.40 పాయింట్లు (0.10%) లాభపడి 23,429.00 వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ (ూవఅంవజఱ) గత ముగింపు (74,346.17) నుంచి 123.51 పాయింట్లు (0.17%) పెరిగి 74,469.68 వద్ద కొనసాగుతోంది. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 97 డాలర్లకు చేరడం కూడా మార్కెట్లపై ఈ ఉదయం ప్రభావం చూపింది. దీంతో మన మార్కెట్లు కూడా ఉదయం 9:15 గంటలకు భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. నిఫ్టీ ఒక దశలో 23,247 స్థాయికి పడిపోయింది.

నిన్నటి ఐటీ రంగ షేర్ల పతనం తర్వాత, ఈరోజు తక్కువ ధరల వద్ద లార్జ్ క్యాప్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి హెవీవెయిట్ బ్యాంకింగ్ షేర్లు మార్కెట్‌ను నిలబెట్టాయి. నిఫ్టీ తన కీలక సపోర్ట్ లెవెల్ అయిన 23,200 – 23,250 జోన్‌ను విజయవంతంగా డిఫెండ్ చేసుకుని, తిరిగి 23,400 మార్కును అధిగమించగలిగింది. శుక్రవారం (జూన్ 5) రాబోయే ఆర్బీఐ మానిటరీ పాలసీ (=దీ× వీూజ) నిర్ణయాల కంటే ముందే మార్కెట్ ఈ రకమైన రికవరీ సాధించడం విశేషం. అయితే, గం. 11 తర్వాత మళ్లీ సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు లాభనష్టాల మధ్య ఊగిసలాడుతున్నాయి.

ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




పేద, మధ్య తరగతి వారికి ఊరట కలిగించే విధంగా వారం రోజుల నుంచి బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఈ రోజు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 110 రూపాయలు.. 22 క్యారెట్లపై 100 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 90 రూపాయలు తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,56,110 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,100 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,080 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రముఖ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర ఇలా (10 గ్రాములు)హైదరాబాద్: రూ.1,56,110

అమరావతి: రూ.1,56,110
విజయవాడ: రూ.1,56,110
విశాఖపట్నం: రూ.1,56,110
రాజమండ్రి: రూ.1,56,110
అనంతపురం: రూ.1,56,110
వరంగల్: రూ.1,56,110
ఖమ్మం: రూ.1,56,110
కడప: రూ.1,56,110

భారీగా తగ్గిన వెండి ధరలు..
ఈ రోజు(గురువారం) వెండి ధరలు భారీగా తగ్గాయి. 100 గ్రాములపై 500 రూపాయలు.. కేజీ వెండిపై 5 వేల రూపాయలు తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి 28,500 రూపాయల దగ్గర.. కేజీ వెండి 2,85,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

పాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సలో కొత్త అడుగు.

నూతన ఔషధంతో రెట్టింపైన జీవన కాలం..



ఇటీవలి కాలంలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సలో పెద్దగా పురోగతి కనిపించకపోవడంతో ఈ వ్యాధిని ఎదుర్కొంటున్న రోగులకు కొత్త ఆశలు చాలా అరుదుగా లభించాయి. అయితే తాజాగా నిర్వహించిన ఒక అంతర్జాతీయ అధ్యయనం ఫలితాలు వైద్య రంగంలో ఆశాజనక సంకేతాలను పంపించాయి. డారాక్సాన్‌రాసిబ్ అనే ప్రయోగాత్మక ట్యాబ్లెట్ అధునాతన దశలో ఉన్న ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ రోగుల జీవితకాలాన్ని గణనీయంగా పెంచగలుగుతుందని పరిశోధకులు వెల్లడించారు. ఈ ఔషధం క్యాన్సర్ కణాల పెరుగుదలకు కారణమయ్యే ఖ=ూూ అనే జన్యు మార్పు చెందిన ప్రోటీన్‌ను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కేసుల్లో 90 శాతానికి పైగా ఈ ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుండగా, దాన్ని లక్ష్యంగా చేసుకునే సమర్థవంతమైన చికిత్సను అభివృద్ధి చేయడం దశాబ్దాలుగా సవాలుగానే ఉంది.

500 మందిపై అధ్యయనం..

మెటాస్టాటిక్ ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 500 మంది రోగులపై నిర్వహించిన అధ్యయనంలో, ఒక వర్గానికి డారాక్సాన్‌రాసిబ్ ట్యాబ్లెట్లను ఇవ్వగా, మరొక వర్గానికి అదనపు కీమోథెరపీ అందించారు. గత చికిత్సలకు స్పందించడం ఆపేసిన రోగులనే ఈ పరిశోధనలో ఎంపిక చేశారు. అధ్యయనం ప్రకారం, డారాక్సాన్‌రాసిబ్ తీసుకున్న రోగులు సగటున 13.2 నెలలు జీవించగా, కీమోథెరపీ పొందిన రోగులు 6.7 నెలలు మాత్రమే జీవించారు. అంటే ఈ కొత్త ఔషధం జీవనకాలాన్ని దాదాపు రెండింతలు పెంచినట్లు గుర్తించారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సలో కీమోథెరపీపై ఇంత స్పష్టమైన ఆధిక్యం చూపిన తొలి ఔషధంగా ఇది నిలిచింది. ఈ ట్యాబ్లెట్లను తీసుకున్న రోగుల్లో కణతుల పరిమాణం తగ్గడంతోపాటు నొప్పి కూడా తగ్గినట్లు పరిశోధకులు తెలిపారు. అంతేకాకుండా, వారి జీవన నాణ్యత మెరుగుపడిందని, చికిత్సను ఎక్కువకాలం కొనసాగించగలిగారని వెల్లడించారు. పరిశోధన విశ్లేషణ పూర్తయ్యే సమయానికి కూడా పలువురు రోగులు ఈ ఔషధాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం.

కీమో సైడ్ ఎఫెక్ట్స్ కన్నా తక్కువే..

అయితే ఈ ఔషధం పూర్తిస్థాయి నివారణను అందించకపోయినా, దాని ప్రభావం కాలక్రమేణా తగ్గిపోయే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. అయినప్పటికీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో పోలిస్తే దీన్ని ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు. డారాక్సాన్‌రాసిబ్ వాడకంలో ప్రధానంగా చర్మంపై తీవ్రమైన దద్దుర్లు, నోటి పుండ్లు వంటి దుష్ప్రభావాలు కనిపించాయి. అయితే తీవ్రమైన కీమోథెరపీ దుష్ప్రభావాలతో పోలిస్తే ఇవి తక్కువగా ఉన్నాయని అధ్యయనం సూచించింది. ఈ పరిశోధనకు ఔషధ తయారీ సంస్థ రివల్యూషన్స్ మెడిసిన్స్ నిధులు సమకూర్చింది.

సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఆరోగ్య పద్ధతులను ఫాలో అవుతున్నారా.. అయితే జాగ్రత్త..

సోషల్ మీడియా యుగంలో ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలు, ట్రెండ్‌లు, తక్షణ ఫలితాలు ఇస్తాయనే వాదనలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థ ఆరోగ్యం లేదా గట్ హెల్త్‌కు సంబంధించిన అనేక సలహాలు సోషల్ మీడియా వేదికలపై వైరల్ అవుతున్నాయి. అయితే వాటిలో ప్రతి ట్రెండ్‌కు శాస్త్రీయ ఆధారాలు ఉండవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటర్నెట్‌లో విస్తృతంగా ప్రచారం పొందుతున్న కొన్ని గట్ హెల్త్ ట్రెండ్‌లు వాస్తవానికి ప్రయోజనాల కంటే సమస్యలను ఎక్కువగా కలిగించే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం చాలామంది ఫైబర్ మ్యాక్సింగ్ పేరుతో ఒకేసారి అధిక మొత్తంలో ఫైబర్ తీసుకోవడం ప్రారంభిస్తున్నారు. సైలియం, ఇన్యులిన్, చియా గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలను ఒకే స్మూతీలో కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్నారు. అయితే ఒక్కసారిగా అధిక ఫైబర్ తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. గట్ మైక్రోబయోమ్ కొత్త ఆహార మార్పులకు అలవాటు పడేందుకు సమయం అవసరం. అందుకే ఫైబర్ మోతాదును క్రమంగా పెంచుకోవడం మంచిది.

పచ్చి పాలు వద్దు..

మరోవైపు ప్రతి వంటకాన్ని బీఫ్ టాలోలో వండే అలవాటు కూడా సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందుతోంది. అయితే ఇందులో సంతృప్త కొవ్వులు అధికంగా ఉండటంతో అధిక మోతాదులో తీసుకుంటే గట్‌లో హానికరమైన బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా పేగుల రక్షణ వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది. పాశ్చరైజ్ చేయని పచ్చి పాలు గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయనే నమ్మకం కూడా ఇటీవలి కాలంలో బాగా వ్యాపించింది. అయితే ఇలాంటి పాలలో సాల్మొనెల్లా, ఈ-కోలి, లిస్టీరియా వంటి ప్రమాదకర బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. ఇవి తీవ్రమైన జీర్ణ సంబంధిత ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతాయి. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బలహీన రోగనిరోధక శక్తి ఉన్నవారికి ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది.

క్లోరోఫిల్ వాటర్ సేఫ్ కాదు..

అలాగే గట్ డీటాక్స్ పేరుతో క్లోరోఫిల్ వాటర్ తాగడం కూడా ఇటీవల ట్రెండ్‌గా మారింది. అయితే మన జీర్ణవ్యవస్థకు ప్రత్యేకంగా డీటాక్స్ అవసరం లేదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్లోరోఫిల్ వాటర్ వల్ల గట్ ఆరోగ్యం మెరుగుపడుతుందనే అంశానికి సరైన శాస్త్రీయ ఆధారాలు లేవు. దీనికి బదులుగా సహజ కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవడం మరింత ప్రయోజనకరం. సోషల్ మీడియాలో వైరల్ అయిన బీన్‌టాక్ ఛాలెంజ్ లో రోజుకు రెండు కప్పుల బీన్స్ తినాలని ప్రోత్సహిస్తున్నారు. బీన్స్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉండటం నిజమే అయినప్పటికీ, ఒక్కసారిగా అంత మోతాదులో తీసుకోవడం చాలామందిలో కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని కలిగించే అవకాశం ఉంటుంది. అందువల్ల బీన్స్ వినియోగాన్ని కూడా క్రమంగా పెంచుకోవడం ఉత్తమం.



హెర్బల్ ఉత్పత్తులు..

ఇక పారాసైట్ క్లెన్స్ పేరుతో మార్కెట్లో లభించే కొన్ని హెర్బల్ ఉత్పత్తులు కూడా విస్తృత ప్రచారం పొందుతున్నాయి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కనిపించే చాలా జీర్ణ సమస్యలకు పరాన్నజీవులు కారణం కావు. ఇలాంటి క్లెన్స్ ఉత్పత్తులు పేగులను చికాకు పెట్టడమే కాకుండా, పోషకాహార లోపాలకు కూడా దారితీసే అవకాశం ఉంటుంది. గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ట్రెండ్‌ను అనుసరించాల్సిన అవసరం లేదు. శాస్త్రీయ ఆధారాలతో కూడిన ఆహారపు అలవాట్లు, సమతుల ఆహారం, తగినంత నీరు, క్రమమైన వ్యాయామం వంటి దీర్ఘకాలిక ఆరోగ్యకరమైన పద్ధతులే జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

వృద్ధాప్యంలో బీట్ రూట్ జ్యూస్ తాగితే ఎంతో మేలు.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..



వృద్ధాప్యంలో అధిక రక్తపోటు అత్యంత సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది గుండె జబ్బులు, పక్షవాతం, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులు రక్తపోటు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొన్ని ఆహార పదార్థాలు కూడా అదనపు ప్రయోజనాలు అందించగలవా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనం బీట్‌రూట్ జ్యూస్ వృద్ధుల్లో రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని సూచించింది. ఈ పరిశోధనలో మొత్తం 75 మంది పాల్గొన్నారు. వీరిలో కొందరు 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగినవారు కాగా, మరికొందరు 60 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. ఆహారంలో ఉండే నైట్రేట్లు రక్తపోటుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, వయస్సును బట్టి దాని ప్రభావంలో ఎలాంటి తేడాలు ఉంటాయో తెలుసుకోవడం ఈ అధ్యయనం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

బీట్ రూట్ జ్యూస్ తాగిన వారిలో..

పరిశోధనలో భాగంగా పాల్గొన్నవారికి రెండు వారాల పాటు రోజుకు రెండు సార్లు నైట్రేట్‌లతో సమృద్ధిగా ఉండే సాంద్రీకృత బీట్‌రూట్ జ్యూస్ ఇచ్చారు. మరో రెండు వారాల కాలంలో నైట్రేట్లు తొలగించిన ప్లాసీబో జ్యూస్ అందించారు. ఈ రెండు దశల మధ్య విరామ కాలాన్ని కూడా పాటించారు, తద్వారా ఫలితాల కచ్చితత్వం మెరుగుపడింది. అధ్యయన ఫలితాల ప్రకారం నైట్రేట్‌లు అధికంగా ఉన్న బీట్‌రూట్ జ్యూస్ తాగిన వృద్ధుల్లో రక్తపోటు స్థాయిలు తగ్గినట్లు గుర్తించారు. అయితే యువకుల్లో ఇదే స్థాయిలో మార్పులు కనిపించలేదు. వయస్సు పెరిగేకొద్దీ శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి తగ్గిపోవడం దీనికి ఒక కారణమై ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. బీట్‌రూట్‌లో సహజసిద్ధంగా నైట్రేట్‌లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోకి వెళ్లిన తర్వాత నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను సడలించి విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఫలితంగా రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు స్థాయిలు తగ్గే అవకాశం ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో నైట్రిక్ ఆక్సైడ్ ప్రాధాన్యత ఇప్పటికే శాస్త్రీయంగా నిర్ధారణ అయింది.

కల్కి రెండున్నర ఏళ్లకు గుడ్ న్యూస్



కల్కి సినిమాలో ముఖ్య పాత్రలో నటించిన దీపికా పదుకునే తప్పుకుందనే విషయం తెల్సిందే. ఆమె తప్పుకోవడంతో ఆ పాత్రను ఎవరు చేస్తారు అనేది ఆసక్తికరంగా మారింది. దీఎ: ఝఎవంష్ట్రఝశ్రీశ్రీఝ । 16 ఝష్ 2026 7:30ఝావీ ఝష్ట్రఝతీవ: కల్కి : రెండున్నర ఏళ్లకు గుడ్ న్యూస్ ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన 'కల్కి' కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సాంకేతిక పరంగా సినిమా మంచి స్పందన దక్కించుకుంది. అందుకే మొదటి పార్ట్ విడుదలైన రెండో రోజు నుంచే సీక్వెల్ గురించి ఎదురు చూపులు మొదలు అయ్యాయి. కల్కి మొదటి పార్ట్ అత్యంత ఆసక్తికరమైన పాయింట్ వద్ద పూర్తి అయిన విషయం తెల్సిందే. దేవుడి పుట్టుక రెండో పార్ట్‌లో ఉంటుంది. దేవుడి పుట్టిన తర్వాత జరిగే పరిణామాలు ఏంటి, మహాభారత ఘట్టాలతో కలిపి కల్కి 2 సినిమా ఉంటుందని మొదటి నుంచి చాలా మంది ఊహిస్తూ వస్తున్నారు. అయితే దర్శకుడు నాగ్ అశ్విన్ అంతకు మించే ఉంటుందని సన్నిహితుల వద్ద అంటున్నాడట. దాంతో కల్కి 2 పై అంచనాలు మరింతగా పెరిగాయి. సీక్వెల్ షూటింగ్ ఎప్పుడెప్పుడు ప్రారంభం అవుతుందా అని అంతా ఎదురు చూస్తున్నారు. ఫ్యాన్స్ మధ్య ఫైట్ ఎందుకు.. హీరోల మధ్య ఫ్రెండ్‌షిప్ చూడండి! కల్కి నుంచి దీపికా పదుకునే ఔట్... కల్కి సినిమాలో ముఖ్య పాత్రలో నటించిన దీపికా పదుకునే తప్పుకుందనే విషయం తెల్సిందే. ఆమె తప్పుకోవడంతో ఆ పాత్రను ఎవరు చేస్తారు అనేది ఆసక్తికరంగా మారింది. మొదటి పార్ట్ షూటింగ్ సమయంలోనే సెకండ్ పార్ట్ దాదాపు సగం షూట్ పూర్తి చేశారనే వార్తలు వచ్చాయి. దాంతో దీపికా పాత్ర విషయంలో దర్శకుడు నాగ్ అశ్విన్ ఏం చేస్తాడా అనే ఆసక్తి నెలకొంది. అమితాబ్ బచ్చన్ పాత్రకు సంబంధించిన షూటింగ్ దాదాపుగా పూర్తి చేశారని తెలుస్తోంది. బ్యాలెన్స్ ఏమైనా ఉంటే రెండు మూడు రోజులు ఆయనతో చేసే అవకాశాలు ఉన్నాయి. కమల్ హాసన్ సైతం ఈ పార్ట్ లో కీలక రోల్‌లో కనిపిస్తాడని అంటున్నారు. కనుక ఆయన పార్ట్ షూటింగ్ ఎంత వరకు అయింది అనేది తెలియాల్సి ఉంది. గత రెండేళ్లుగా ఎదురు చూస్తున్న కల్కి 2 షూటింగ్ ప్రారంభంకు సంబంధించిన కీలక అప్‌డేట్ అతి త్వరలో యూనిట్ సభ్యుల నుంచి రాబోతుందట. ఝశ్రీంశీ =ఘఎ – తెలుగు సినిమా గర్వించే విధంగా 'రణబాలి' : విజయ్ దేవరకొండ ఝాఎజవతీఅంవఎవత్ కల్కి 2 షూటింగ్ ప్రారంభం కోసం... ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం కల్కి 2 షూటింగ్‌ను నవంబర్‌లో ప్రారంభించబోతున్నారు. ప్రభాస్ ఫౌజీతో పాటు స్పిరిట్‌కు సంబంధించిన షూటింగ్స్ తో గత ఏడాది కాలంగా బిజీ బిజీగా ఉన్న కారణంగా కల్కి 2 కి డేట్లు ఇవ్వలేక పోయాడట. ఫైనల్‌గా వచ్చే నెల నుంచి డేట్లు ఇచ్చేందుకు ఓకే చెప్పాడట. దాంతో నాగ్ అశ్విన్ షూటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకు ముందుతో పోల్చితే ఈసారి మరింత భారీగా కొన్ని సెట్స్ ను వేయాల్సి ఉందట. అందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెబుతున్నారు. మొదటి పార్ట్‌కు వచ్చిన రెస్పాన్స్ నేపథ్యంలో కొన్ని కొత్త సీన్స్ సైతం యాడ్ చేసే ప్లాన్ ను దర్శకుడు నాగ్ అశ్విన్ చేస్తున్నాడు. మొత్తానికి కల్కి 2 షూటింగ్ ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఇదో పెద్ద గుడ్ న్యూస్‌గా చెప్పుకోవచ్చు. ఝశ్రీంశీ =ఘఎ – చిరంజీవి గారికి నా కథ నచ్చలేదు.. వెంకీ కుడుముల కామెంట్స్! ప్రభాస్, నాగ్ అశ్విన్ కల్కి 2.... రెండున్నర ఏళ్ల తర్వాత మళ్లీ కల్కి సెట్స్ లో యూనిట్ అడుగు పెట్టబోతుంది. ప్రేక్షకుల ఎదురుచూపులకు తెర పడుతుంది. భారీ అంచనాల నడుమ రూపొందబోతున్న కల్కి 2 సినిమా అన్ని అనుకున్నట్లుగా జరిగితే 2028 ఆరంభంలో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. దాదాపు ఏడాది పాటు మేకింగ్ ఉంటుందని, అలాగే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సైతం సమాంతరంగా నిర్వహిస్తూ వచ్చే ఏడాది చివరి వరకు అన్ని పనులు పూర్తి చేయాలని మేకర్స్ టార్గెట్ పెట్టుకున్నట్లు చెబుతున్నారు. మొన్నటి వరకు అనుకున్నట్లుగా వచ్చే ఏడాదిలో కల్కి 2 సినిమా విడుదల సాధ్యం కాదని తేలిపోయింది. 2028 వరకు సినిమా కోసం వెయిట్ చేయాల్సిందే. వెంటనే రాకున్నా ఒకవైపు షూటింగ్ జరుగుతుంది అంటే కచ్చితంగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తారు. కనుక కల్కి 2ను ప్రారంభించడం అనేది అభిమానులకు పెద్ద పండుగ న్యూస్ అనడంలో సందేహం లేదు. మరి దసరాకు ఆ వార్తను ఫ్యాన్స్ కి నాగ్ అశ్విన్ అండ్ టీం వినిపించేనా చూడాలి.

'కింగ్ 100' టైటిల్ వెనక అసలు రహస్యం? అక్కినేని

నాగార్జున 100వ చిత్రం -కింగ్ 100- శరవేగంగా చిత్రీకరణను పూర్తి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. కింగ్ 100 టైటిల్ వెనక అసలు రహస్యం? అక్కినేని నాగార్జున 100వ చిత్రం -కింగ్ 100- శరవేగంగా చిత్రీకరణను పూర్తి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆర్. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని అన్నపూర్ణా స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే నాగార్జున ఇలాంటి టైటిల్ నే ఎందుకు ఎంచుకున్నాడు? అంటూ చాలా కాలంగా చర్చ సాగుతోంది.ఈ సినిమాకు -కింగ్ 100- అనే శీర్షిక ఎందుకు పెట్టారో వివరిస్తూ కథలోని ఒక కీలకమైన సన్నివేశంలో అసలు కారణాన్ని చూపించబోతున్నారని ఇన్‌సైడ్ వర్గాల సమాచారం. నాగార్జున సినీ కెరీర్‌లోనే ఈ ప్రత్యేక అంశం కథకు ప్రధాన బలంగా నిలవనుందని.. ఇది అభిమానుల్లో అంచనాలను భారీగా పెంచుతుందని టాక్ వినిపిస్తోంది. ఇలాంటి టైటిల్ వెనక రహస్యం ఏమిటో తెలుసుకోవాలనుకునేవారికి ఇది సర్ ప్రైజింగ్ గా ఉండనుందని కూడా తెలుస్తోంది. ఝశ్రీంశీ =ఘఎ – కల్కి : రెండున్నర ఏళ్లకు గుడ్ న్యూస్ ఈ చిత్రం కథాంశం ఒక సామాన్యుడి అసాధారణ ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది. పేదరికం నుంచి స్వశక్తితో ఎదిగి, అత్యంత సంపన్నుడిగా మారి -ది కింగ్- అనే బిరుదును పొందిన ఒక వ్యక్తి చుట్టూ కథ తిరుగుతుంది. ఆగస్టు 29న అన్నపూర్ణా స్టూడియోస్ విడుదల చేసిన టీజర్ గ్లింప్స్ ప్రేక్షక లోకాన్ని గొప్పగా ఆకట్టుకుంది. కట్టల కొద్దీ నోట్లు, ఇటుకల్లా పేర్చిన బంగారు బిస్కట్లు, గుర్రపు పందెలు, శత్రువుల దండయాత్రల నడుమ రూ. 50,000 కోట్ల భారీ ఆర్థిక కుంభకోణం వెలుగుచూడటం.. దానితో తలెత్తే రాజకీయ ఉద్రిక్తతలు.. అల్లర్ల నేపథ్యం టీజర్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి



.- తెలుగు సినిమా గర్వించే విధంగా 'రణబాలి' : విజయ్ దేవరకొండ ఝాఎజవతీఅంవఎవత్ ఈ విజువల్ గ్రాండియర్ వెనుక ఒక భావోద్వేగపూరితమైన ఉపకథ కూడా ఉంది. ఒకవైపు వేల కోట్ల స్కామ్- విధ్వంసం ప్రాణంగా నిలవనుంది.

తెలుగు సినిమా గర్వించే విధంగా 'రణబాలి'




విజయ్ దేవరకొండ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 'రణబాలి' సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. దీఎ: ఝఎవంష్ట్రఝశ్రీశ్రీఝ । 16ఝష్ 2026 6:58ఝావీ ఝష్ట్రఝతీవ: తెలుగు సినిమా గర్వించే విధంగా రణబాలి : విజయ్ దేవరకొండ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన 'రణబాలి' సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. సినిమాకు పబ్లిక్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి వస్తున్న టాక్ నేపథ్యంలో చిత్ర యూనిట్ సభ్యులు మీడియా ముందుకు వచ్చారు. ఈ మధ్య కాలంలో సినిమా విడుదల రోజే యూనిట్ సభ్యులు అంతా మీడియా ముందుకు రావడం మనం చూస్తూ ఉన్నాం. సినిమా సక్సెస్ సెలబ్రేషన్ ను మీడియాతో, ప్రేక్షకులతో జరుపుకోవడం కోసం రణబాలి టీం సైతం మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మీడియా సమావేశంకు హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న, దర్శకుడు రాహుల్, నిర్మాతలు ఇంకా మైత్రి బ్యానర్‌కి చెందిన ప్రముఖులు హాజరు అయ్యారు. మీడియా సమావేశంలో నిర్మాతలు మాట్లాడుతూ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని, కొందరు లెంగ్త్ విషయమై మాతో మాట్లాడటం జరిగింది, అయితే న్యూ వరల్డ్ బిల్డింగ్ కనుక కాస్త ఎక్కువ నిడివితోనే సినిమాను చూపించాల్సి ఉంటుంది అన్నారు. ఈ సినిమాను ఫ్యామిలీ ఆడియన్స్ చూడదగ్గట్లుగా దర్శకుడు రాహుల్ రూపొందించాడని, ఒక చరిత్రను ఈ సినిమాలో చక్కగా చూపించినందుకు సంతోషంగా ఉందని, అంతే కాకుండా మా ప్రయత్నంను ఆదరిస్తున్నందుకు కూడా చాలా సంతోషంగా ఉందని నిర్మాతలు చెప్పుకొచ్చారు.



'జైలర్ 2' లో ఆ సీన్స్ అవసరమా?

జైలర్ 2 లో ఆ సీన్స్ అవసరమా? నెల్సన్ డైరెక్షన్ లో రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'జైలర్ 2' మూవీ రీసెంట్ గా రిలీజ్ అయింది. మొదటి పార్ట్ సూపర్ హిట్ అవ్వడంతో సీక్వెల్ మీద భారీ అంచనాలు నెలకొన్నాయి... ఈ సినిమాలో రజినీకాంత్ తో పాటు బాలీవుడ్ అత్యుత్తమ నటి విద్య బాలన్ ఒక క్యారెక్టర్ లో నటించింది... బంవం విద్యాబాలన్ చేత ఆ క్యారెక్టర్ ఏంటి? కహానీ, డర్టీ పిక్చర్ సినిమాలతో విమర్శకుల ప్రశంశలను అందుకున్న విద్యాబాలన్ చాలా గొప్ప నటి.. ఈ మూవీ లో ఆమె స్థాయికి తగ్గ పాత్రను తీర్చిదిద్దలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం రౌడీ గ్యాంగ్ లో సభ్యురాలుగా చూపించడం ఏంటి? అంటూ నెల్సన్ మీద విమర్శలు చేస్తున్నారు... ఝశ్రీంశీ =ఘఎ – ఫ్యాన్స్ మధ్య ఫైట్ ఎందుకు.. హీరోల మధ్య ఫ్రెండ్‌షిప్ చూడండి! సామాజిక స్పృహ ఉండాలి... ప్రస్తుత కాలంలో ప్రేక్షకుల ఆలోచన తీరు పూర్తిగా మారిపోయింది. ప్రధాన పాత్రలు ఎంతో కొంత సామాజిక స్పృహ కలిగి ఉండాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. కానీ నెల్సన్ మాత్రం వాటిని పట్టించుకోకుండా కొన్ని సన్నివేశాలను రాసుకున్నాడనే విమర్శలు వస్తున్నాయి. విద్యాబాలన్ పాత్ర పట్ల రజినీకాంత్ వ్యవహరించిన తీరు మహిళా వ్యతిరేక చర్యలని చూపించే విధంగా రాశారంటూ సినీ విమర్శకులు సైతం నెల్సన్ మీద విమర్శలు చేస్తున్నారు....

రామాయణ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ముహూర్తం ఫిక్స్ .. వేదిక ఎక్కడంటే?



ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవిలతో పాటు రావణాసురుడి పాత్రలో నటిస్తున్న యష్, దర్శకుడు నితీష్ తివారి, నిర్మాత నమిత్ మల్హోత్రా హాజరుకానున్నారు. దీఎ: మీఘఎష్ట్రబ =వఎఎఎ । 16 ఝష్ 2026 3:18ఝావీ ఝష్ట్రఝతీవ: రామాయణ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ముహూర్తం ఫిక్స్.. వేదిక ఎక్కడంటే? బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, నైచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతగా నటిస్తున్న విజువల్ వండర్ 'రామాయణ' చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. నితీష్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా, కన్నడ రాకింగ్ స్టార్ యష్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ రెండు భాగాల దృశ్యకావ్యం పార్ట్-1 నవంబర్ 5న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక తెలుగు ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించబోయే గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ డీటెయిల్స్‌ను మేకర్స్ తాజాగా అనౌన్స్ చేశారు. ఆ విశేషాలు ఇలా వున్నాయి..ఫ్యాన్స్ మధ్య ఫైట్ ఎందుకు.. హీరోల మధ్య ఫ్రెండ్‌షిప్ చూడండి! హైదరాబాద్‌లో గ్రాండ్ ఈవెంట్.. వేదిక ఎక్కడంటే?: మేకర్స్ 'రామాయణ' ప్రమోషన్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. నిన్న బెంగళూరులో వేలాది మంది అభిమానుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించగా, దానికి మైండ్ బ్లాకింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఆ దివ్యమైన